మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- తానూరు– బెల్‌తరోడా డబుల్‌రోడ్డుపై కానరాని హెచ్చరిక బోర్డులు
- తరచుగా ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు



హెచ్చరిక బోర్డు లేని బోరిగాం బాలాజీ గుట్ట ప్రాంతంలోని మలుపు



బోల్సా గ్రామ సమీపంలో ప్రమాదకర మలుపు



సూచిక బోర్డుల్లేని హిప్పెల్లి ఎక్స్‌రోడ్డు

తానూరు: మన దేశంలో రోగాల బారిన పడి చనిపోయే వారి కన్నా.. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయే వారి సంఖ్యే ఎక్కువ. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడంతోపాటు మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడం ప్రధాన కారణం. ముధోల్ నుంచి తానూరు మీదుగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన బెల్‌తరోడా వరకు 24 కిలోమీటర్ల మేర డబుల్‌రోడ్డు నిర్మించారు. నాలుగేళ్ల కిందట రోడ్డు నిర్మాణం పూర్తయినా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో కొందరు గాయాలపాలవుతుండగా.. మరికొందరు మృత్యువాత పడుతున్నారు.

రూ.36 కోట్లతో డబుల్ రోడ్ల నిర్మాణం..

మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న మండలానికి ప్రత్యేక రాష్ట్రంలో తానూరు నుంచి బెల్‌తరోడా వరకు రూ.36 కోట్లతో డబుల్‌రోడ్డు నిర్మించారు. ముధోల్ నుంచి తానూరు వరకు రూ.18 కోట్లు, తానూరు నుంచి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన బెల్‌తరోడా వరకు రూ.18 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించడంతో మండలవాసుల ఇబ్బందులు తొలగిపోయాయి.

ప్రమాదకరంగా ఆరు మలుపులు..

ముధోల్ నుంచి తానూరు వచ్చే మార్గంలో పది కిలోమీటర్ల మేర జలశంకర్ ఆలయ సమీపంలో, దౌలతాబాద్ బస్టాప్ వద్ద, సింగన్‌గాం గ్రామ సమీపంలో మూడు ప్రమాదకర మలుపులున్నాయి. తానూరు నుంచి బెల్‌తరోడా వెళ్లే మార్గంలో 13 కిలోమీటర్ల మేర రోడ్డు ఉండగా.. హిప్పెల్లి సమీపంలో మలుపు, బోరిగాం గుట్ట ప్రాంతంలో, బోల్సా సమీపంలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

మలుపుల వద్ద జరిగిన ప్రమాదాలివీ..

- రెండేళ్ల కిందట బోల్సా గ్రామ సమీపంలోని మలుపు వద్ద ముధోల్ మండలం మచ్కల్ గ్రామానికి చెందిన ముగ్గురు బైక్‌పై వెళ్తుండగా వంతెనను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డారు. అందులో కథం సాయినాథ్ మృతి చెందాడు.
- తానూరుకు చెందిన ఒనోడ్ లక్ష్మణ్ ముధోల్ సమీపంలోని జలశంకర్ ఆలయం సమీపంలో ఉన్న మలుపు వద్ద ప్రమాదం బారిన పడ్డారు. బోరిగాం గ్రామ సమీపంలో ఇద్దరు మహారాష్ట్ర వాసులు ప్రమాదానికి గురయ్యారు.
- ఇటీవల ఎల్వి గ్రామానికి చెందిన జొరిగల్ ధర్మన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టి మృతి చెందాడు.
- నెల కిందట హిప్పెల్లి బస్టాప్ వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.

అధికారులకు పట్టింపు లేదు..

నింబధనల ప్రకారం రోడ్డు నిర్మాణం పూర్తవగానే సంబంధిత కాంట్రాక్టర్ మలుపువద్ద, బస్టాప్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ రోడ్డు పనులు పూర్తయి నాలుగేళ్లు గడుస్తున్నా.. ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఆర్‌అండ్‌బీ డీఈ కొండయ్యను ఫోన్‌లో సంప్రదించేందుకు 'సాక్షి' యత్నించగా అందుబాటులోకి రాలేదు.

బోర్డులు ఏర్పాటు చేయాలి



బెల్‌తరోడా నుంచి తానూరు వరకు, తానూరు నుంచి ముధోల్ వరకు డబుల్ రోడ్డు మార్గంలో ఉన్న మలుపులపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. హెచ్చరిక బోర్డులు లేక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – బాబన్న, ట్రాక్టర్ డ్రైవర్, హిప్పెల్లి

ప్రమాదాలను నివారించాలి



హిప్పెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటే వాహనదారుల ప్రాణాలు దక్కుతాయి.

– ఆశన్న , హిప్పెల్లి

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	20
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్

నారాయణ: వాల్తేరు వీరయ్య

క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి అండ



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలో మసూద్‌బేగ్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. లోకేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మసూద్‌బేగ్‌తో 1987–88లో పదో తరగతి చదివిన అతడి మిత్రులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా తాము జమ చేసిన రూ.36వేల నగదును మృతుడి భార్యకు అందజేశారు. సర్పంచ్ భూమన్న, పూర్వవిద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు సదానందం, ఉపాధ్యాయులు పరమేశ్వర్, దేవేందర్‌రెడ్డి, శివచరణ్, ఇస్మాయిల్, రవీందర్‌చారి, రమణారెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్ ఉన్నారు.

1న విగ్రహ ప్రతిష్ఠాపన

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో మార్చి1న మహాపోచమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఆలయంలో హోమ పూజలు, బుధవారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిష్ఠాపనకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్‌చైర్మన్ సాగర హాజరవుతారని.. భక్తులు తరలి రావాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.ఎనిమిది లక్షలతో సీసీరోడ్డు, రూ.నాలుగు లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ మైస ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో భీంరావుపటేల్, మైసన్న, వార్డుసభ్యులు ఉన్నారు.

బిలోలి నుంచి మాల్కాపూర్ వరకు..

లోకేశ్వరం: మండలంలోని బిలోలి నుంచి మాల్కాపూర్ గ్రామం వరకు రూ.రెండున్నర లక్షలతో మట్టి రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం పనులు ప్రారంభించి మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, సాయారెడ్డి, బండి ప్రశాంత్, నర్సింగ్‌రావు, కడారి రాజు, ఈరన్న ఉన్నారు.

ఇష్టపడి చదువుకోవాలి



నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దస్తురాబాద్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని ఎంపీపీ సింగరి కిషన్ అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో 22వ వార్షికోత్సవం నిర్వహించారు. ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి జెడ్పీ నిధుల నుంచి రూ.ఐదు లక్షలు వెచ్చిస్తామని జెడ్పీటీసీ శారద పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజమణి, ప్రధానోపాధ్యాయుడు ముత్యం, ఏసీఎంవో శివాజీ, రాజేశ్వర్, రామ్, నందు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన రుక్మాపూర్ గురుకుల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 361మంది విద్యార్థులు పరీక్షకు హాజరవాల్సి ఉండగా 320 మంది హాజరయ్యారు. 41మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాకల్యాణి తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్యశిబిరంతోపాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రానికి గంట ముందే విద్యార్థులు హాజరు కావాలనే నిబంధనను విద్యార్థులు పాటించారు. పోషకులను లోనికి అనుమతించకపోవడంతో రోడ్డు పక్కనే చెట్లనీడన సేదతీరారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



కుంటాలలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

కుంటాల: రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుంటాలలోని మున్నూరు కాపు సంఘ ఆవరణలో రూ.ఐదు లక్షలతో నిర్మించే ప్రహరీ, రూ.రెండున్నర లక్షలతో నిర్మించే మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, సర్పంచ్ సమత వెంకటేశ్, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి, సింగిల్‌విండో చైర్మన్ గజ్జారాం, సర్పంచుల సంఘం మండల కన్వీనర్ ప్రదీప్‌కుమార్, మున్నూరుకాపు సంఘం తాలుక, గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ల రమేశ్, రాఘవేందర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జుట్టు గజేందర్ తదితరులు ఉన్నారు.

పనులకు భూమిపూజ

ముధోల్: మండల కేంద్రంలోని బోదవాడుకట్టు, ధన్గర్‌గల్లీలో రూ.50లక్షల నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మండల ప్రజలకు వైద్యం అందించేందుకు నిర్మిస్తున్న బాసర–భైంసా ప్రధాన రహదారి వద్ద ఏరియా ఆస్పత్రి పనులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఆఫ్రోజ్‌ఖాన్, సర్పంచ్ రాజేందర్, ఎంపీటీసీలు శ్రీనివాస్‌గౌడ్, భూమేశ్, కోఆప్షన్ సభ్యుడు ఖలీద్, పోతన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

'కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి'



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

లక్ష్మణచాంద: కేంద్రం ఇస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు అన్నారు. ఆదివారం సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతుందన్నారు. కేంద్రం మంజూరు చేస్తున్న నిధులతోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, తదితర హామీలను విస్మరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, వినోద్, ప్రశాంత్, ప్రమోద్, రాజేశ్వర్, ప్రకాశ్, తదితరులు ఉన్నారు.

సారంగపూర్: తెలంగాణలో అభివృద్ధి మాట దేవుడెరుగు.. అవినీతి రాజ్యమేలుతుందని బీజేపీ నాయకులు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. మండలంలోని చించోలి(బి) గ్రామంలో శనివారం రాత్రి ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక రాష్ట్రంలో దోచుకున్నది సరిపోక బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసి దేశం మీద పడుతున్నారని విమర్శించారు. ఈ కుటుంబ పార్టీకి ఏ రాష్ట్రానికి వెళ్లినా చీత్కారాలు, ఛీదరింపులు తప్పవన్నారు. రూ.కోట్ల నిధులిస్తే రాష్ట్రానికి ఇస్తే ఒక్క పైసా కూడా కేంద్రం ఇవ్వడం లేదని చెప్పడం ప్రభుత్వ పరిపాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో శక్తికేంద్రం ఇన్‌చార్జి వెంకటేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు విలాస్, శ్యాంసుందర్‌రెడ్డి, చిన్నయ్య, పవన్, భూపతిరెడ్డి, రాజన్, ప్రజలు, తదితరులు ఉన్నారు.

షూటింగ్ సందడి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మీ మందిరం వద్ద లవ్ ఫెయిల్యూర్ పాట షూ టింగ్ ఆదివారం ప్రారంభించారు. ఈపాట లిరిక్స్, దర్శకత్వం బంగల్‌పేట్‌కే చెందిన కంటం గణేశ్ వహించగా కెమెరామెన్ కిరణ్‌కుమార్, మారుతి చిత్రీకరించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బిట్లింగ్ నవీన్, కోఆప్షన్ సభ్యులు చిలుక గోవర్ధన్, ఆలయ కమిటీ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం సాహిత్యరత్న అన్నాబావు సాఠే విగ్రహావిష్కరణ మహోత్సవ కరపత్రాలను టీజీఓ జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్ ఆవిష్కరించారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో ఏర్పాటు చేస్తున్న విగ్రహా విష్కరణ మహోత్సవాన్ని జయప్రదం చే యాలని కోరారు. ఈ సందర్భంగా విగ్రహా ఏర్పాటుకు తన వంతుగా రూ.20వేలు విరాళంగా అందజేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



సరుకులు అందిస్తున్న మోహన్‌రావ్ పటేల్

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు, నగదు కాలిపోయిన బాయ్ భోజన్న కుటుంబీకులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకులు మోహన్‌రావ్ పటేల్ డిమాండ్ చూశారు. ఆదివారం బాధిత కుటుంబసభ్యులను ఆయన పరామర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.25వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇల్లు అందించి ఆదుకోవాలని కోరారు. వారి వెంట సర్పంచ్ గోప సాయినాథ్, రవి, మధుపటేల్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్లకు నిధులు మంజూరు

లోకేశ్వరం: మండలంలోని అన్ని గ్రామాలకు సీసీ రోడ్లు నిర్మించేందుకు ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ లోలం కళావతి ఒక ప్రకటనలో తెలిపారు. అబ్దుల్లాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.ఏడు లక్షలు, అర్లికి రూ.రెండు లక్షలు, గొడిసెరాకు రూ.ఐదు లక్షలు, బామ్నికేకు రూ.2 లక్షలు, బాగాపూర్‌కు రూ.4లక్షలు, బిలోలికి రూ.7లక్షలు, ధర్మోరకు రూ.7లక్షలు, గడ్‌చాందకు రూ.8లక్షలు, హథ్గాంకు రూ.7లక్షలు, పోట్‌పల్లికి రూ.3లక్షలు, హవర్గకు రూ.7లక్షలు, జోహర్‌పూర్‌కు రూ.2లక్షలు, వాస్తాపూర్‌కు రూ.6లక్షలు, కన్కపూర్‌కు రూ.7లక్షలు, కిష్టాపూర్‌కు రూ.7లక్షలు, లోకేశ్వరంకు రూ.10 లక్షలు, మన్మద్‌కు రూ.7లక్షలు, నగర్‌కు రూ.4లక్షలు, నగర్‌తండాకు రూ.4లక్షలు, పంచగుడికి రూ.3లక్షలు, మొహాళకు రూ.4లక్షలు, పిప్రికి రూ.7లక్షలు, పోట్‌పల్లి(బి)కి రూ.4లక్షలు, ఎడ్దూర్‌కు రూ.3లక్షలు, పుస్పూర్‌కు రూ.10 లక్షలు, రాయపూర్‌కాండ్లీకి రూ.5లక్షలు, రాజురకు రూ.7 లక్షలు, సాథ్గాంకు రూ.5లక్షలు, సేవాలాల్‌తండాకు రూ.6లక్షలు, వట్టోలికి రూ.3లక్షలు, బాలాజీనగర్ తండాకు రూ.8లక్షలు, దుర్గానగర్ తండాకు రూ.10 లక్షలు, నర్సింహానగర్ తండాకు రూ.10లక్షలు, రాజేశ్‌తండాకు రూ.5లక్షలు మంజూరయ్యాయన్నారు.

బిర్యానీ పాయింట్ సందర్శన



తయారీ విధానం తెలుసుకుంటున్న మంత్రి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద ఆదివారం ఒక ప్రైవేట్ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం పక్కనున్న రెడ్ బకెట్ బిర్యానీ పాయింట్‌ను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా యజమానితో బిర్యానీ తయారీ, నాణ్యత, ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కూల్.. కూల్.. రంజన్



వేసవికాలం ప్రారంభం కావడంతో రంజన్(చల్లటి కుండ)లకు డిమాండ్ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో జనాలు చల్లని నీటి కోసం ఆరాటపడుతున్నారు. ఆదిలాబాద్ రంజన్‌తోపాటు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నుంచి చల్లటి కుండలను తీసుకొచ్చి జిల్లా కేంద్రంలోని వివిధ కూడళ్లలో విక్రయిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కనులపండువగా ఆలయాల్లో పూజలు



భైంసాటౌన్ : బోనాలతో వెళ్తున్న కాలనీవాసులు



ఆలయానికి వెళ్తున్న వంజరి సంఘం సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని నేతాజీనగర్ పాండ్రి మైసమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బంగల్‌పేట్ మహాలక్ష్మీ ఆలయంలో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మీ అమ్మవారికి ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గాయత్రి దేవయజ్ఞం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాంరావ్‌బాగ్‌లో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రి దేవయజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్య వేద మంత్రోచ్ఛరణల నడుమ యజ్ఞం చేశారు. పురోహితుడు మాట్లాడుతూ యజ్ఞాలు చేస్తే శాంతి, సౌభాగ్యం చేకూరుతాయన్నారు. కాలనీవాసులు, ఆర్య సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీగజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. గజ్జలమ్మ దేవికి అభిషేకం, అలంకరణ పల్లకీసేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మహారాష్ట్ర బోకర్, నాందేడ్, ధర్మాబాద్, శివుని, అప్పారావుపేట ప్రాంతాల భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వపత్రార్చనలు, గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీప స్థాపన, రుత్వికరణం, మండపారాధన, శివపార్వతుల కల్యాణం, రుద్రహవనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శనిగారపు రాణి తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో..

ఖానాపూర్: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు బీఆర్‌ఎస్ నాయకుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ బాదావత్ పూర్ణచందర్‌నాయక్‌తోపాటు టీజీఓ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా భక్తులకు మహా అన్నదానం చేశారు.

కడియం అందజేత

కుంటాల: మండల కేంద్రంలో ఆదివారం శ్రీ గజ్జలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో కుంటాలకే చెందిన మట్ట గంగామణి తన మూడు తులా ల వెండి కడియం పో గొట్టుకుంది. దీంతో ఆలయ కమిటీ సభ్యుడు టి. శివ భక్తురాలికి మూడు తులాల వెండి కడియం చేయించి అందజేశారు.